PRGI NO: TGTEL/26/A1984

ViSiON PRABHA

విజన్ ప్రభ

తెలుగు దినపత్రిక

Published from . హైదరాబాద్..నల్గొండ. సూర్యపేట. రంగారెడ్డి. విజయవాడ. గుంటూరు.

TGTEL/26/A1984 VISION PRABHA
విజన్ ప్రభ
తెలుగు దినపత్రిక
విజన్ ప్రభ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను
• ప్రాంతీయ వార్తలపై పట్టు మరియు ఆసక్తి ఉన్నవారికి ప్రాధాన్యత
• అనుభవం ఉన్నవారికి మెరుగైన అవకాశం
కావలసిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు:
98661 88619
96030 44841
నియమనిబంధనలు వర్తిస్తాయి

గురువారం మే 28, 2026 | ఎడిటర్. తూనం.వెంకటేశ్వర రావు. | సంపుటి:1 సంచిక:62 | పేజీలు 4 | వెల-2

పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్న రేవంత్

హైదరాబాద్,మే27 :
వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం

కల్లాల్లో తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన

2లో..

- పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలుల వర్షం
- తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేయాలని డిమాండ్

హైదరాబాద్,మే27 :
భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు భారీ వర్షంఎండల నుంచి ఉపశమనం కలిగించినా, అన్నదాతలక మాత్రం కన్నీరు మిగిల్చింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలకు పలు కొనుగోలు కేంద్రా ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపోయాయి రవాణాకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలకు కల్లాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. సిద్దిపేట జిల్లా ముత్స్యాలో అత్యధికంగా 12.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది. మహబూబూనగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ., నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ. వర్షం కురిసింది. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. డిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌కు రేవంత్ లేఖ

హైదరాబాద్:
తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై మహారాష్ట్ర సీఎంకు రేవంత్ రెడ్డి లేఖ రాశారు. బ్యారేజీ ఎత్తు, నిర్మాణంపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. సమావేశానికి అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని ఫడ్నవీస్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసింది." అని రేవంత్ లేఖలో పేర్కొన్నారు."మొదటి ప్రతిపాదనలో 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం. 2016లో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. 148 మీటర్ల ఎత్తు ఉత్తర తెలంగాణ నీటి అవసరాలకు సరిపోదని నిపుణులు తెలిపారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల సాగు, తాగునీటి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం. బ్యారేజీ ఎఫ్ఆర్ఎల్ (ఖీ=ా) పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం చాలా తక్కువ. ఎత్తు పెంచితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీటిని తెచ్చుకునే వీలుంది" అని లేఖలో సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

2లో..

- ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి
- జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు
- కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్,మే27 :
రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

రైతుల ఆగ్రహంలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది

- ధాన్యం సేకరణలో ఎప్పుడూ లేనంత నిర్లక్ష్యం
- మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శలు

వనపర్తి,మే27
రైతులకు దుర్భర పరిస్థితులు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం మట్టికొట్టుకుపోవడం ఖాయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.

ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

- రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానికి సిఎం వినతి
- పలు అంశాలపై ప్రకటనవిడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,మే27 :
తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసు కున్నారు.

2లో..

కల్లాల వద్ద దైన్యంగా రైతులు

- పంటల కొనుగోలు లేక దీనావస్థ
- వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి
- బిఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి
- పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు

2లో..

హైదరాబాద్,మే27 :
రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

2లో..

సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం

- హరీష్ రావు ఆరోపణల నుంచి దృష్టి మరల్చే యత్నం
- తనపై నిందలు మోపి మళ్లీ జైలుకు పంపే కుట్రలు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపణ

హైదరాబాద్,మే27 :
సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం పై హరీష్ రావు సంచలన ఆరోపణల నుంచి దృష్టిని మరల్చడానికే మంత్రులు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా

2లో..

దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోంది: సీపీఎం

హైదరాబాద్:
దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు విజయ రాఘవన్, బీవీ రాఘవులు విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈడీని అడ్డుపెట్టుకుని కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌పై కేంద్రం వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు.
"కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీలను దుర్వినియోగం చేస్తోంది. సీపీఎం సీనియర్ నేతలపై అవినీతి కేసులు లేనప్పటికీ దాడులు చేస్తోంది. పినరయి విజయన్ నివాసంలో ఈడీ సోదాలు.. రాజకీయ దాడే. ప్రశ్నించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దర్యాప్తు సంస్థలను కేంద్రం ప్రయోగిస్తోంది. ఈ కుట్రలకు వ్యతిరేకంగా రాజకీయంగా, న్యాయపరంగా ప్రజలను సమీకరించి పోరాటం చేస్తాం. వాయిదాల పద్ధతిలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ సామాన్యులపై తీవ్ర భారాన్ని మోపుతున్నారు.

2లో

డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త

ప్రజలను హెచ్చరించిన సిపి సజ్జన్నార్

హైదరాబాద్,మే27 :
బక్రీద్ పండుగ నేపథ్యంలో.. డిజిటల్ చెల్లింపుల విషయంలో వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

తెలంగాణలో ఈడీ అధికారుల దాడులు..

ఏకకాలంలో 8 చోట్ల..

మిగతాది 2లో

కల్లాల్లో తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన

మొదటిపేజీ తరువాయి

రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు జేసి ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంటా పెట్టాల్సిన వడ్లు అకాల వర్షాలకు కండ్ల ముందే నీళ్లలో కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అష్టకష్టాలు పడి రైతులు కష్టాలను దిగమింగుకొని ధాన్యపు సిరులు పండించారు. పుట్లకొద్ది పండిస్తే ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా, ధాన్యం కొనుగోలు చేయకపోవడం, అరకొరా కొన్నా కాంటాలు పెట్టకపోవడం, నెలల తరబడి గన్నీ సంచులు అందక, మద్దతు ధర లభించక, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ, తీరా కాంటాలు పెట్టాక లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం పంటలు తడిసి ముద్దయ్యింది. సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఈదురు గాలులు భారీగా వీచడంతో చెట్లు కరెంటు స్తంభాలు కూలిపోయాయి. మెదక్ జిల్లాలోని మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, చిన్న శంకరంపేట్, రామాయంపేట, చేగుంట తో పాటు పలు మండలాల్లో కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొని ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వడ్ల కుప్పలు ఉండగా మరికొన్ని చోట్ల వరి ధాన్యం బస్తాలో నింపించారు. కాంటజేసిన లారీలు సకాలంలో రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాలలో నిలువ చేశారు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిచిపోవడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

రైతుల ఆగ్రహంలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది

మొదటిపేజీ తరువాయి

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బుధవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలసి జిల్లాలోని పెద్దమందడి మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమవడం రేవంత్ రెడ్డి చేతగానితనం, నిర్లక్ష్యమేనని ఆరోపించారు. రైతులకు ఉద్దేశపూర్వకంగానే సకాలంలో యూరియా ఇవ్వకుండా, కరెంట్ సరఫరాలో కోతలు పెడుతూ, కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు విసిగిపోయి తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటే, ప్రభుత్వంపై భారం పడకుండా ఉంటుందని రేవంత్ కుట్ర చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. నాడు కేసీఆర్ పంట చేతికి రాగానే వెంటనే ధాన్యం కొనుగోలు చేసి, వారం రోజుల్లోనే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తు చేశారు. నేడు రేవంత్ తుగ్లక్ పాలనలో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తోందని దుయ్యబట్టారు.

డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త

మొదటిపేజీ తరువాయి

ఇటీవల కాంచన్‌బాగ్, రాజేంద్రనగర్ పీఎస్‌ల పరిధుల్లో రెండు డిజిటల్ మోసాలు వెలుగులోకి వచ్చాయని సీపీ తెలిపారు. కాంచన్‌బాగ్‌లో ఆరుగురు వ్యక్తులు ఒక వ్యాపారితో బేరమాడి, రూ.5వేలు చెల్లించినట్లుగా చూపించే నకిలీ యాప్ స్క్రీన్‌ను చూపించి రూ.68వేల విలువైన పశువులతో ఉడాయించారని తెలిపారు.

అదేవిధంగా, రాజేంద్రనగర్‌లో నలుగురు వ్యక్తులు రూ.48వేల విలువైన మేకలను కొనుగోలు చేసి, నకిలీ పేమెంట్ యాప్‌తో బురిడీ కొట్టించారన్నారు. ఖాతాలో డబ్బు జమ కాలేదని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, మేకలు, గొర్రెల అమ్మకందారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులను అప్పగించే ముందు, మీ బ్యాంకింగ్ ఖాతాలో బ్యాలెన్స్ నిర్ధారించుకోవాలన్నారు. ఎవరైనా మోసం చేయడానికి ప్రయత్నిస్తే డయల్ 100కు కాల్ చేసి పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

కల్లాల వద్ద దైన్యంగా రైతులు

మొదటిపేజీ తరువాయి

కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకో వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం

మొదటిపేజీ తరువాయి

సింగరేణి కార్మిక సంఘం సమావేశంలో తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి తనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. సింగరేణిని సీఎం బామ్మర్దికి అప్పగించారని ఆరోపించారు. తనపై తెలంగాణ ఉద్యమంలో 226 కేసులు ఉన్నాయని, సీసీఎస్ డార్క్ సెల్‌తో సహా హైదరాబాద్ నగరంలో అన్ని పోలీస్ స్టేషన్‌లో ఉన్నానని వెల్లడించారు.సింగరేణి కార్మికులు, ప్రజల ఓట్లతో రెండు సార్లు గెలిచాను.ప్రజల దృష్టిని మరల్చడానికి తన వ్యాఖ్యలను చీప్ ట్రిక్ కింద వాడారని విమర్శించారు. సీఎం కార్యాలయం డైరెక్షన్ మేరకు తనను ట్రోల్ చేస్తున్నారని వివరించారు. మరోసారి తనపై కేసు పెట్టి జైలుకు పంపుతారేమోనన్న అనుమానం వ్యక్తం చేశారు . క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా ఇబ్బందులు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేశారు. . ఫార్మా కంపెనీని కాలుస్తా అన్న జడ్చర్ల ఎమ్మెల్యేపై, నరుకుతా అన్న రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ఠాగూర్‌పై కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. నాడు ప్రగతి భవన్‌ను బాంబులు పెట్టి పేల్చాలని పీసీసీ అధ్యక్షుడి హోదాలో మాట్లాడిన రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల ఏ వర్గం సంతృప్తిగా లేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ ప్రభుత్వం తనను టా÷–గ్గ÷ట్ చేసింది. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి టా÷–గ్గ÷ట్ చేస్తోందని ఆరోపించారు. శ్రీలంకలో,బంగ్లాదేశ్ లో ప్రజలు తిరగబడునట్లు తెలంగాణలోను ప్రజల తిరుగుబాటు వస్తుందని వెల్లడించారు.

సీఎం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించే లోగా రైతుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,ప్లలె రవికుమార్ , కురువ విజయ్ కుమార్ , తుంగ బాలు , పడాల సతీష్ రాజేష్ ,రవీందర్ రెడ్డి ,హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

మొదటిపేజీ తరువాయి

దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదరటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

మొదటిపేజీ తరువాయి

ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీలో పలు అంశాలు చర్చించారని సమాచారం. తొలుత దిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తమిళనాడుకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో చర్చించినట్లు పేర్కొంది. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్థించినట్లు పేర్కొంది. అనంతరం ఆయన నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్–విజయ్ పోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.ఐ

దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోంది: సీపీఎం

మొదటిపేజీ తరువాయి

అన్ని రంగాల్లోనూ మోదీ ప్రభుత్వం విఫలమైంది" అని విజయ రాఘవన్ అన్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రతిపక్షాలపై దాడులను కేంద్ర ప్రభుత్వం ముమ్మరం చేసిందని బీవీ రాఘవులు ఆరోపించారు. "కాక్రోచ్ జనతా పార్టీ వెబ్‌సైట్‌ని మూసి వేయించింది. తమిళనాడులో ప్రభుత్వం ఏర్పడకుండా గవర్నర్‌తో అడ్డుకునే ప్రయత్నం చేసింది. భారత విదేశాంగ విధానం సక్రమంగా లేదు. ట్రంప్ విధానాలను మోదీ వ్యతిరేకించడం లేదు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తాం" అని బీవీ రాఘవులు అన్నారు.

తెలంగాణలో ఈడీ అధికారుల దాడులు..

ఏకకాలంలో 8 చోట్ల..

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో మరోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల దాడులు జరుగుతున్నాయి. హైదరాబాద్, కరీంనగర్‌లో ఈడీ తనిఖీలు చేస్తోంది. ఇసుక, గ్రానైట్ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తోంది. ఏకకాలంలో ఎనిమిది చోట్ల ఈ దాడులు జరుగుతున్నాయి. జీఎస్టీ ఎగ్గొట్టి రూ.కోట్లు దారిమళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి.కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ ఫ్యాక్టరీ, ఏజెన్సీల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల నకిలీ ఇన్ వాయిస్‌లతో గ్రానైట్ తరలించిన కేసులో తనఖీలు చేస్తున్నారు. ఇప్పటికే ఓ గ్రానైట్ వ్యాపారిని జీఎస్టీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. జీఎస్టీ ఎగ్గొట్టేందుకు నకిలీ బిల్లులతో వంద కోట్ల రూపాయల విలువైన గ్రానైట్ తరలించినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఈడీ ఎంట్రీతో మరింత దుమారం రేగుతోంది.

మహిళలకు టిడిపి పెద్దపీట
పార్టీ పరంగా 33 శాతం రిజర్వేషన్లకు శ్రీకారం

– తీర్మానం ప్రతిపాదించిన వర్కింగ్ ప్రసిడెంట్ లోకేశ్

మహానాడు వేదికగా టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ సంచలన ప్రతిపాదన చేశారు. పార్టీ పరంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రతిపాదిస్తూ కీలక చర్చకు శ్రీకారం చుట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదన రాష్ట్ర రాజకీయాల్లోనే కాక జాతీయస్థాయిలో కూడా ఆసక్తికర చర్చకు దారితీసింది. 2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ తీసుకున్న నిర్ణయానికి ఈ ప్రతిపాదన మరింత ప్రాధాన్యాన్ని తీసుకువచ్చింది. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం, నిర్ణయాత్మక స్థానాల్లో వారికి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ నిర్ణయం ఉందని నాయకులు చెబుతున్నారు. మహిళా రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే అంశంతో సంబంధం లేకుండా పార్టీ అంతర్గత వ్యవస్థలోనే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని లోకేశ్ ప్రతిపాదించడం విశేషంగా మారింది. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా లోకేశ్ ప్రస్తావించారు. టీడీపీ భవిష్యత్తు కార్యాచరణలో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మహానాడు వేదికగా వచ్చిన ఈ ప్రతిపాదనపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది.

మాజీ సిం విజయన్ ఇంటివద్ద ఉద్రిక్తత ఇడి అధికారుల కారుపై రాళ్లదాడి

దాడిలో ధ్వంసం అయిన కారు అద్దాలు
అధికారులకు తృటిలో తప్పిన ప్రమాదం

కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఆయన నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. వీటిని తీవ్రంగా వ్యతిరేకించిన పినరయి మద్దతుదారులు.. ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఈడీ అధికారులపై దాడికి పాల్పడ్డారు. వారి కారు అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు, కేంద్ర బలగాలు నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వెనక్కి తగ్గకపోవడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాడి సమయంలో వాహనంలో మహిళా అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. ఆందోళనకారులను సీపీఎం కార్యకర్తలుగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనను ఈడీ తీవ్రంగా పరిగణించింది. ఆందోళనకారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరువనంతపురంలోని థంపనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలావుంటే కేరళం మాజీ సీఎం పినరయి విజయ్ నివాసంలో ఈడి రెయిడ్స్‌ను వ్యతిరేకిస్తూ ఆయన మద్దతుదారులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. బుధవారం తిరువనంతపురంలో సోదాల అనంతరం తిరిగి వెళుతున్న ఈడీ అధికారుల వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు రాళ్లతో వాహనంపై దాడి చేయడంతో కారు అద్దాలు దెబ్బతిన్నాయి. ఈడీ రాక నేపథ్యంలో పినరయి విజయన్ నివాసానికి ఆయన మద్దతుదారులు భారీగా చేరుకోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈడీ అధికారుల వాహనాన్ని అక్కడి నుంచి పంపించేశారు. కేంద్ర ప్రభుత్వం కావాలని ఈడి దాడులు నిర్వహిస్తోందని సీపీఎం నేతలు ఆరోపించారు. కొచ్చిన్ మినరల్స్ అండ్ రిటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) కేసులో మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసాలతో సహా కేరళంలోని 10 ప్రాంగణాల్లో ఈడి సోదాలు నిర్వహిస్తోంది. తిరువనంతపురంలోని మాజీ సీఎం విజయన్ ప్రస్తుత నివాసంతో పాటు ఆయన స్వస్థలమైన కన్నూర్‌లోని మరో ప్రాంగణం, మాజీ సీఎం విజయన్ అల్లుడు, మాజీ మంత్రి మొహమ్మద్ రియాజ్‌కు చెందిన నివాసంలో (కోజికోడ్) కూడా ఈడీ రెయిడ్స్ నిర్వహించింది. సోదాల సమయంలో మాజీ సీఎం, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉండగా బయట మద్దతుదారులు నిరసనలకు తెరతీశారు. సెక్యూరిటీ సిబ్బందిపై కొందరు దాడికి దిగే ప్రయత్నం చేయడంతో పార్టీ సీనియర్ నేతలు వారిని అడ్డుకుని శాంతింపజేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మాజీ సీఎం విజయన్ కూతురు వీణా విజయన్‌కు చెందిన ఐటీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ నుంచి ఎలాంటి సేవలు పొందకుండానే సీఎంఆర్ఎల్ డబ్బులు చెల్లించిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ రెయిడ్స్ నిర్వహించింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ కూడా రంగంలోకి దిగింది. మొత్తం రూ.2.7 కోట్లు సీఎంఆర్ఎల్ నుంచి ఎక్సాలాజిక్‌కు అందినట్టు ఆరోపణలు వచ్చాయి. ఐటీ సర్వీసులు, కన్సల్టెన్సీ సేవల మాటున ఈ చెల్లింపులు సాగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక ఈడీ కేసును కొట్టేయాలంటూ సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కేరళ హైకోర్టు ఇటీవలే తోసిపుచ్చింది. మరోవైపు, ఈ ఆరోపణలను మాజీ సీఎం విజయన్ గతంలోనే కొట్టిపారేశారు. తమ ఇమేజీని దెబ్బతీసే లక్ష్యంగా ఈ ఆరోపణలు పుట్టుకొచ్చాయని చెప్పారు.

టిడిపి మహానాడుకు రికార్డు స్థాయిలో స్పందన
మహానాడులో పాల్గొన్న ఆరు లక్షల మంది

తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడుకు రికార్డు స్థాయిలో స్పందన లభించింది. హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన ఈ మహానాడులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్లస్టర్లతో పాటు తెలంగాణ, అండమాన్, ఇతర దేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున కార్యకర్తలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. మొత్తం ఆరు లక్షల మంది కార్యకర్తలు మహానాడులో పాల్గొన్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 1875 క్లస్టర్ల ద్వారా కార్యకర్తలు తమ ఐడీ కార్డులతో హాజరు నమోదు చేసుకున్నారని తెలిపారు. రామ్మోహన్ నాయుడు ఈ ప్రకటన చేయగానే మహానాడులో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు హర్షధ్వానాలు చేశారు. ఒక ప్రాంతీయ పార్టీ హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు నిర్వహించడం, లక్షలాది మంది వర్చువల్‌గా పాల్గొనడం రికార్డు అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

దేశంలో 25శాతం పెట్టుబడులు ఎపికే రాజకీయాల్లో యువతకు పెద్దపీట వేస్తాం

– విశాఖ మహానాడు వేదికలో ఎంపి శ్రీభరత్

దేశంలో గత ఏడాది వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే వచ్చాయని విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు ఎం. భరత్ వెల్లడించారు. స్పీడ్ ఆఫ్ డ్యూయింగ్ బిజినెస్ నినాదంతో సక్సెస్ అయ్యామన్నారు. బుధవారం విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలోని 42, 43వ వార్డుల క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ శ్రీభరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ.. 20, 25 ఏళ్ల లోపు యువతకు పబ్లిక్ పాలసీ, రాజకీయాల్లో పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మహిళా బిల్లు చట్టం అమలులోకి రావడం ఖాయమన్నారు. పార్టీలోకి పెద్ద ఎత్తున మహిళా శ్రేణులను తెలుగుదేశం పార్టీ ఆహ్వానిస్తోందని తెలిపారు.

టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించటం శుభసూచకమని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో టీడీపీ మరింత బలంగా ముందుకు వెళ్లనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 82 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ప్రతి క్లస్టర్‌లో మహానాడు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోసం ప్రత్యేకంగా భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా1,850 క్లస్టర్లలో మహానాడు సమావేశాల నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలోని 81 క్లస్టర్లలో వర్చువల్‌గా నిర్వహించిన మహానాడులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియమకాల చట్టం ప్రకటించాలి.

ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కంగల శ్రీనివాస్.

పోలవరం మే 27 ,(విజన్ ప్రభ) ,రంపచోడవరం నియోజకవర్గం,దేవీ పట్నం మండలం,దేవారం గ్రామపంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామంలో ఉన్న శ్రీ కోదండ రామాలయం నందు ఆదివాసీల ప్రజా సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశానికి ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కంగల శ్రీనివాస్ మాట్లాడుతూ...తక్షణమే (టి.ఏ.సి) ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ద్వారా తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియమకాల చట్టం ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆదివాసీలకు ఇచ్చిన హామీ నెరవేర్చి ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న 1917,1959,1/70 భూమి చట్టాలు,అటవీ హక్కుల చట్టం,పెసా చట్టం పటిష్టంగా అమలుకావాలంటే ఆదివాసుల స్వయం పాలన రాష్ట్రం సాధించుకున్నప్పుడే ఆదివాసీల సంక్షేమం,అభివృద్ధి జరుగుతుందన్నారు.ఆ దిశగా ఆదివాసులు మలిదశ శాంతియుత ఉద్యమానికి ఆదివాసీ యువతి యువకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ...పోలవరం నిర్వాసితులకు కొత్త చట్టం ప్రకారం శాస్త్రీయ సమగ్ర పునరావాసం కల్పించాలని,ఏజెన్సీ మారు మూల గ్రామాలకు మౌలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ నిరుద్యోగ హక్కులు ఉద్యోగాల సాధన కమిటీ జిల్లా అధ్యక్షులు మడి మురళి,భారత్ ఆదివాసీ పార్టీ మండల నాయకులు కుంజం రామన్న దొర,జిల్లా స్టీరింగ్ కమిటీ కార్యనిర్వహణ అధ్యక్షుడు చవలం విద్యాసాగర్,కారం రంగా రావు దొర,ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా మహిళ అధ్యక్షురాలు దూసరి కనకదుర్గ,ఎంపిటిసి తుర్రం జగదీష్ దొర,ఏపీ ఆదివాసీ జేఏసీ మండల కార్యదర్శి యలగాడనాగేశ్వరరావు,మడకం కృష్ణ దొర,కుంజం శ్రీనివాస్ మరియు గ్రామ పెద్దలు,మహిళలు,యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో వర్చువల్‌గా మహానాడు భారీగా తరలివచ్చిన తెదేపా శ్రేణులు

కోదాడలో తెదేపా మహానాడు కోలాహలం

కోదాడ మే 27 (విజన్ ప్రభ) నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు బుధవారం కోదాడ లో ఘనంగా నిర్వహించారు. మహానాడు కోఆర్డినేటర్లు ముత్తినేని సైదేశ్వర రావు, ఓరుగంటి ప్రభాకర్ ల ఆధ్వర్యంలో వర్చువల్ పద్ధతిలో ఏర్పాటు చేసిన ఈ మహాసభకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తెదేపా శ్రేణులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

? ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం సభలో లైవ్ స్క్రీన్ల ద్వారా అధినాయకత్వ సందేశాన్ని కార్యకర్తలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పట్ల నేటికీ ప్రజల్లో ఏమాత్రం అభిమానం తగ్గలేదని రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింతగా పోరాడుతామన్నారు. నాయకులు సభా వేదిక పైకి తరలివచ్చి ఐక్యతను చాటుతూ కలిసికట్టుగా పనిచేసి తెలుగుదేశం పార్టీని బలోపేతం చేద్దామని జై తెలుగుదేశం, జై చంద్రబాబు, ఎన్టీఆర్ అమర్ హై అంటూ నినాదాలు చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో సాగర్ ఇన్చార్జి మువ్వ అరుణ్ కుమార్, హుజూర్నగర్ మండవ వెంకటేశ్వర్లు, చాగంటి వెంకటేశ్వరరావు, జడ రాములు, కొల్లు సత్యనారాయణ,భయ్యా నారాయణ, కొల్లు నరసయ్య, సాతులూరి గురవయ్య, బండ్లమూడి వెంకటేశ్వరరావు, గుండు నాగేశ్వరరావు, పిట్టల శోభన్ బాబు, కోలా శ్రీరాములు తదితరులు

ప్రజలకు మరింత చేరువగా పోలీసింగ్..

- **రూరల్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్**

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీస్ మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ నిర్వహణ, రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజలకు మరింత స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని పోలీస్ సిబ్బందికి సూచించిన ఎస్పీ,దూర ప్రాంతాల నుండి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు ప్రస్తుత ఎండ తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం పోలీస్ అధికారులతో సమావేశమైన ఎస్పీ మాట్లాడుతూ, యువతను గంజా వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందన్నారు. గ్రామ స్థాయిలో రాత్రి పహారా (నైట్ పట్రోలింగ్) విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు.

అలాగే తమ పరిధిలో ఉన్న హోటల్స్, లాడ్జ్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ అనుమానాస్పద వ్యక్తులు, చట్ట విరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు.

గంజా వంటి మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతోందని, వాటి దుష్పరిణామాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

గంజా సంబంధిత సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే 8712656999 నంబర్‌కు సమాచారం అందించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీస్ ప్రజలను కోరారు.

ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తే ఊరుకునేది లేదు..

- **కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్.**

భారత్ ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ ధ్వజమెత్తారు. బుధవారం మహేశ్వరం మండల కేంద్రంలో మాజీ మంత్రి హరీష్ రావు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటే అభివృద్ధిని అడ్డుకున్నట్టేనని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్తు తరాల కోసం భారత్ ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. ఫార్మా ఏర్పడితే ఈ ప్రాంతం కలుషితమవుతుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న పనులను ఓర్వలేకనే అడ్డుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీ జోలికి వస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటే బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, శివగంగ దేవాలయం చైర్మన్ అల్లెకుమార్, మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షుడు బంగారు గల్ల లాజర్, ప్రధాన కార్యదర్శి హాజీ బాబా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లె బిక్షపతి సర్పంచులు నేనావత్ రాజు నాయక్, దేవేందర్ నాయక్, గొల్లూరి రాజు నాయకులు ఆవుల యాదయ్య, సుభాష్, యూత్ అధ్యక్షుడు ఆకాష్ గదగూటి జంగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

"మన గ్రామం -- మన బాధ్యత" : హింగె

- **పర్యావరణాన్ని కాపాడుకుందాం -- ఆరోగ్యంగా జీవిద్దాం**

పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల భూమి నిస్సారమవ్వడమే కాకుండా భవిష్యత్తు తరాల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ ఉ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు హింగె భాస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో విస్తృతంగా చాటింపు కార్యక్రమాలు నిర్వహించి రైతుల్లో అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే వరి కొయ్యలు, మొక్కజొన్న చొప్పలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు."పర్యావరణాన్ని కాపాడుకుందాం -- ఆరోగ్యంగా జీవిద్దాం" అనే నినాదంతో రైతుల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు.పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సేంద్రీయ కర్బనం, మిత్ర పురుగులు నశించి నేల సారం దెబ్బతింటుందని తెలిపారు. అలాగే పొగ కారణంగా వాయు కాలుష్యం పెరిగి ప్రజల్లో ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం తీవ్రంగా ప్రభావితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.పంట వ్యర్థాలను రైతులు ఆధునిక పద్ధతుల్లో వినియోగించుకోవాలని సూచించిన ఆయన, హార్వెస్టర్ల ద్వారా పొడి చేసి భూమిలో కలియదున్నడం, కంపోస్ట్ ఎరువుగా తయారు చేయడం, మల్చింగ్ విధానంలో నేల తేమను కాపాడడం, పుట్టగొడుగుల పెంపకానికి వరి గడ్డిని వినియోగించడం వంటి మార్గాలను వివరించారు.ఈ సందేశం ప్రతి రైతుకు చేరేలా గ్రామాల్లో టమ్‌టమ్ ద్వారా చాటింపు వేయించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.అధికారులు, రైతు సంఘాలు, గ్రామస్థులు కలిసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు."మన గ్రామం -- మన బాధ్యత... మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది" అని పేర్కొంటూ ఉమ్మడి జిల్లాలోని రైతాంగం మొత్తం పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలని భాస్కర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వల్బాపూర్ క్లస్టర్ ఏఈఓ బాబు, శ్రీధర్ రావు, రవీందర్ రావు, మొగిలి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

- **బండారు శ్రావణ్ కుమార్ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి**

బీబీనగర్ పట్టణ కేంద్రంలో గాయత్రి నగర్ కాలిని పక్కన ఉన్న శేష సాయి కాలనీలో నిలిచిపోయిన డ్రైనేజ్ వాటర్ ను సమస్యను పరిష్కరించాలని స్థానిక సర్పంచ్ పంజాల శ్రీనివాస్ కి మరియు గ్రామపంచాయతీ కార్యదర్శి జాకీర్ కి బుధవారం రోజున సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బండారు శ్రావణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ బీబీనగర్ పట్టణ కేంద్రంలో ఉన్న శేష సాయి కాలనీ వెంచర్లో గత రెండు సంవత్సరాల క్రితం ప్లాట్లు కొనుగోలు చేసుకుని కాలనీవాసులు ఇల్లు నిర్మాణం చేసుకొని కుటుంబాలతో ఉంటున్నారు.కాలనీలోని రోజువారీగా వచ్చే డ్రైనేజీ వాటర్ ఒకే చోటకు రావడంతో,వాటర్ నిలిచిపోయి మురుగు వాసన రావడంతో పందులు కుక్కలు,డ్రైనేజీ వాటర్ లో చనిపోవడంతో దుర్వాసనతో దోమలతో కాలనీలో ఉన్న వారు అనారోగ్యాలకు గురవుతున్నారు.కాలనీలోని నిలిచిపోయిన డ్రైనేజీ వాటర్ ను పక్కన ఉన్న గాయత్రీ నగర్ కాలనీలోని డ్రైనేజీ వాటర్ ను కలపాలనీ,ఇట్టి విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని,డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది.అదేవిధంగా కాలనీలో ఉంటున్న ఇండ్లకు ఇంటి నెంబరు పరిమిషన్ ఇవ్వాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఓవల్దాస్ సతీష్ నాయకులు బండారు శ్రీరాములు,గాడి శ్రీనివాస్,పబ్బతి యాదగిరి,కోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై పురోహితులతో మహిళాశిశు సంక్షేమ శాఖ వారి అవగాహన సదస్సు.

ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజులు అవగాహన కార్యక్రమాలలో భాగంగా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారు దివ్య క్షేత్రం భద్రాచలం లో బాల్యవివాహాలు పై అవగాహన కార్యక్రమాలు వివాహాలు జరిపించే పురోహితులతో నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం వారు రూప స్వాతి మాట్లాడుతూ ఆడపిల్లలకి 18 సంవత్సరాలు మగవారికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు జరిపించాలని. బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే నష్టాలను వివరించడం జరిగింది. బాల్యవివాహాలు జరిగినట్లయితే 1098 నెంబర్ కి కాల్ చేసి సమాచారాన్ని ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయి అని వివరించారు. బాల్యవివాహాల నిర్మూలన మన అందరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం వారు పురోహితులు పాల్గొనడం జరిగింది.

ఈ సందర్భంగా పురోహిత సంఘం అధ్యక్షులు రామా వజ్జల. రవికుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు తమ పురోహితులు జరిపించ రని , బాల్య వివాహాలు జరిగినట్లు మా దృష్టికి వచ్చినట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ కు తెలియజేస్తామని తెలిపారు.

మహిళల సమైక్య వారోత్సవాల కార్యక్రమం

సూర్యాపేట జిల్లా మే 27 (విజన్ ప్రభ)

నడిగూడెం : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా మండల సమైక్య వారోత్సవాల సందర్భంగా 15 నుండి 18 సంవత్సరాల కిశోర బాలికలకు వేసవి శిక్షణ కార్యక్రమం శిబిరం భాగంగా సైకిల్ నేర్పించు కార్యక్రమన్ని బుధవారం జడ్పీహెచ్ఎస్ నడిగూడెం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో మల్సూర్, ,సర్పంచ్ దున్న శ్రీను , ఉప సర్పంచ్ వి నాగరాజు , ఏపిఎం ఆర్ దుర్గాప్రసాద్, సిసి శ్రీనయ్య ,మండల సమైక్య అకౌంటెంట్ జ్యోతి, మరియు మండల సమైక్య కోశాధికారి రేఖ లత, వివో ఎస్ సంఘ బంధం అధ్యక్షురాలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చునరీ... చునరీ రీమిక్స్ గీతం

హిందీ సినిమా 'బివీ నెం.1'(1999)లోని 'చునరీ చునరీ' అనే గీతంతో యువతని విశేషంగా ఆకట్టుకున్నారు బాలీవుడ్ అగ్రతార సల్మాన్ ఖాన్, సుస్మిత సేన్. ఇప్పుడీ పాటకి రీమిక్స్ గీతంలో ఇద్దరు నాయికలతో కలిసి స్టెప్పులేస్తూ అలరించడానికి సిద్ధమయ్యాడు హీరో వరుణ్ ధావన్. ఆయన, కథానాయికలు పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో రాబోతున్న చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. ఈ చిత్రంలో బాలీవుడ్ ఐకానిక్ గీతం 'చునరీ చునరీ'ని రీమేక్ చేశారు. ఈ సినిమా జూన్ 5న విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా ఈ పాటని సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది. 'ఎగిరే పక్షి ఎగురుతూనే ఉంది.. కానీ నా మనసే గాలిపటంలా నిన్నే కలవరపెడుతోంది ఇదేంటి?' 'నా ప్రియతమా నీకెలా చెప్పాలి' లాంటి లిరిక్స్‌తో సాగే ఈ గీతం వరుణ్, పూజా, మృణాల్‌ల కెమెస్ట్రీతో ఆకట్టుకుంటోంది. ఈ పాటని సింగ్, జోనితా గాంధీ, అనురాధ శ్రీరామ్ తదితరులు కలిసి ఆలపించారు. డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రమేశ్ తౌరనీ నిర్మించారు. మౌనీరాయ్, చుంకీ పాండే, జిమ్మి షెర్గిల్ తదితరులు ఈ సినిమాలో కీలకపాత్రలు పోషించారు.

'ధురంధర్' ప్రొడక్షన్ డిజైనర్‌పై లైంగిక వేధింపుల కేసు

ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. తాజాగా ఈ చిత్రానికి వర్క్ చేసిన ప్రొడక్షన్ డిజైనర్ సైనీ జోహ్రేపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టులో అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చండీగఢ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

గతేడాది సెప్టెంబర్ 10న సినిమాకు సంబంధించిన చర్చల కోసం సైనీ తనను చండీగఢ్‌లోని ఒక హోటల్‌కు రావాలని కోరినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడికి వెళ్లాక అసభ్యకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. తాను అనారోగ్యానికి గురైనప్పటికీ, అక్కడి నుండి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే కెరీర్ దెబ్బతింటుందని నిందితుడు బెదిరించినట్లు ఆమె ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాయికా ప్రాధాన్య చిత్రంలో మమిత!



'ప్రేమలు' సినిమాతో యువతరాన్ని తన ప్రేమ మాయలో పడేసింది మమితా బైజు. త్వరలో ఆమె 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'జన నాయగన్' లాంటి భారీ చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే ఇప్పుడామె తన తొలి నాయికా ప్రాధాన్య చిత్రాన్ని పట్టాలెక్కించినట్లు సమాచారం. 'లవ్‌టుడే', 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన యువ హీరో ప్రదీప్ రంగనాథన్ ఈ చిత్రంతో నిర్మాతగా మారుతున్నట్లు తెలిసింది. ఆయన వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన కుర్రాడు దీనికి దర్శకత్వం వహించనుండగా.. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా ఇటీవలే చెన్నైలో లాంఛనంగా మొదలైందని.. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సమాచారం.

ఆ మాట చెప్పడానికి నేను భయపడను

ప్రస్తుతం ఇండస్ట్రీ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉందని నిర్మాత దిల్ రాజు తెలిపారు. తాను ఈ మాట చెప్పడానికి భయపడనన్నారు. 'సమ్మర్ హాలీడేస్' సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు దిల్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త వాళ్లతో సినిమా చేస్తే విజయం వస్తుందని తాను నమ్ముతానంటూ.. సమ్మర్ హాలీడేస్ మంచి హిట్ కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. "ఇండస్ట్రీ ప్రస్తుతం చాలా కష్టకాలంలో ఉందని చెప్పడానికి చాలా మంది భయపడతారు. నేను ఈ విషయాన్ని ధైర్యంగా చెప్పగలను. ప్రేక్షకులను థియేటర్‌లకు తీసుకురావడమే మనందరికీ ఇప్పుడు సవాల్. సమ్మర్ హాలీడేస్ లాంటి సినిమాలు తీసి ఆడియన్స్‌ను థియేటర్‌కు తీసుకురండి. అప్పుడు ఆటోమేటిక్‌గా మంచి సినిమాలు నిలబడతాయి. చిన్న సినిమాలతో డైరెక్టర్లు అందరూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు. కొత్త దర్శకులందరూ మంచి చిత్రాలు తీసి ఇండస్ట్రీని నిలబెట్టండి. చిన్న సినిమాలు ఎంత విజయం సాధిస్తే ఇండస్ట్రీ అంత బాగుంటుంది" అని అన్నారు. "చాలా రోజుల తర్వాత ఒక ఈవెంట్ ఇంత సంతోషంగా జరగడం చూస్తున్నాను. ఈ విషయంలో నిర్మాతలను అభినందించాలి. ఎందుకంటే ఈ మధ్యకాలంలో ఏ ఈవెంట్ కూడా ఇంత అద్భుతంగా జరగలేదు. థియేటర్‌లలో కూడా సందడి కనిపించడం లేదు. ఈ 'సమ్మర్ హాలీడేస్'తో థియేటర్‌లలో సందడి నెలకొనాలని కోరుకుంటున్నా" అని దిల్‌రాజు తెలిపారు.

17 ఏళ్ల తర్వాత పెద్ది కోసం ఫిల్మ్ నెగెటివ్‌ను వాడాం: డీవోపీ రత్నవేలు

"'పెద్ది' చిత్రంలో క్రికెట్ మ్యాచ్ స్క్రీన్‌పై చూస్తుంటే రెండు జట్ల మధ్య యుద్ధంలా అనిపిస్తుంది. రామ్ చరణ్ సెటిల్డ్ ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చారు. ఆయన ఇంటెన్సిటీని ప్రేక్షకులు ఖచ్చితంగా ఎక్స్‌పీరియన్స్ చేస్తారు' అని చెప్పారు డీవోపీ రత్నవేలు. రామ్ చరణ్ హీరోగా బుచ్చి బాబు సానా డైరెక్షన్‌లో వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రం జూన్ 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా డీవోపీ రత్నవేలు ఇలా ముచ్చటించారు.

కొవిడ్ తర్వాత సినిమా ట్రెండ్ మారింది. ప్రేక్షకులు రియలిజాన్ని కోరుకుంటున్నారు. అందుకే 'పెద్ది' కోసం రియలిస్టిక్ ఫీలింగ్ ఉన్న విజువల్స్‌ను క్రియేట్ చేశాం. నలభై ఏళ్ల క్రితంనాటి విజయనగరం కథను విజువల్‌గా ఎంత అందంగా చెప్పాలనేది ముందుగా ప్లాన్ చేశాం. అప్పటి ప్రజలు ఒక కలర్‌ను ఎక్స్‌పీరియన్స్ చేసి ఉంటారు. ఆ ఫీల్‌ను రీ క్రియేట్ చేయడానికి ప్రయత్నించాం. చివరి ఫ్రేమ్ వరకు కనెక్ట్ అయ్యేలా ఒక మూడ్ క్రియేట్ చేశాం. సినిమాలో వచ్చే సెకండ్ క్రికెట్ మ్యాచ్ చాలా కీలకం. కథలో అదొక పెద్ద మలుపు. దాన్ని నైట్ ఎఫెక్ట్‌లో చేద్దామని బుచ్చిబాబుకు సూచించాను. 80లలో ఫ్లడ్‌లైట్ మ్యాచ్‌లు జరిగేవి. ఆ మూడ్ కోసం నైట్ షూట్ అయితే బాగుంటుందని అనిపించింది. షూటింగ్ తర్వాత చరణ్ గారు వచ్చి "అద్భుతమైన ఆలోచన, ఈ సీన్‌తో సినిమా నెక్స్ట్ స్టేజ్‌కు వెళ్లింది' అని చెప్పడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. కుస్తీ పోటీలు మరో పెద్ద ఛాలెంజ్. కాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్‌తో పాటు ప్రతి మజిల్‌ను డెవలప్ చేసి, ఒక రియల్ పహిల్వాన్‌లా కనిపించారు. హనుమంతుడి రిఫరెన్స్‌తో వచ్చే ఒక సీక్వెన్స్ థియేటర్‌లో చూసినప్పుడు గూస్‌బంప్స్ వస్తాయి. చరణ్‌లో ఒక హనుమంతుడిని ఫీల్ అవుతారు. తన ట్రాన్స్‌ఫర్మేషన్ నిజంగా అద్భుతం. ఒక కథను 60 శాతం స్క్రీన్ మీదకు తెస్తే సూపర్ హిట్ అంటారు. కానీ బుచ్చిబాబు 200 శాతం స్క్రీన్ మీదకు తీసుకొచ్చారు. ఢిల్లీలో తీసిన సీన్స్ నాకు చాలా ఫేవరెట్. లైట్ లేకుండా షూట్ చేశాను. దాని కోసం దాదాపు 17 ఏళ్ల తర్వాత తెలుగులో మళ్లీ ఫిల్మ్ నెగెటివ్‌ను ఉపయోగించాం. డిజిటల్ కెమెరాల ఔట్‌పుట్ బాగున్నా, ఒక రియల్ ఫీల్ కోసం ఫిల్మ్ నెగెటివ్ వాడాం. శ్రీలంకలో ఇంతవరకూ ఎవరూ షూట్ చేయని లొకేషన్స్‌లో షూట్ చేశాం. అక్కడి రైల్వే ట్రాక్ మమ్మల్ని ఎగ్జైట్ చేసింది. అక్కడో వాటర్‌ఫాల్ సీక్వెన్స్ కూడా ఉంది. 'పెద్ది' క్లైమాక్స్ చాలా ఛాలెంజింగ్. విజువల్ గ్రాండియర్‌తో పాటు ఎమోషనల్ హై కూడా ఉంటుంది. చివరి 30 నిమిషాలు ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు. ఇక త్వరలో డైరెక్షన్ చేయబోతున్నా. ఇప్పటికే మూడు కథలు రాశా. మంచి ఎమోషన్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్ తీస్తా.

మంచు మనోజ్ మంచి మనసు.. అనాథాశ్రమాన్ని సందర్శించిన నటుడు

నటుడు మంచు మనోజ్ పెద్ద మనసు చాటుకున్నారు. అనాథాశ్రమం నిర్వాహకుల అభ్యర్థన మేరకు ఆశ్రమాన్ని సందర్శించారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో 'మాతృదేవోభవ' అనాథాశ్రమాన్ని సందర్శించి ఆయన అక్కడ మతిస్థిమితం సరిగ్గా లేని ఒక వ్యక్తికి నిర్వాహకులతో కలిసి హెయిర్ కటింగ్ చేశారు. అనంతరం కొత్త దుస్తులు ఇచ్చారు. ఆశ్రమానికి అవసరమైన టేబుళ్లు, కుర్చీలను విరాళంగా అందజేశారు.

సమాజంలో ఎవరూ లేనివారికి అండగా నిలవడం గొప్ప విషయమని మనోజ్ అన్నారు. భవిష్యత్తులో కూడా ఈ ఆశ్రమానికి తనవంతు సహకారం ఎప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. రెండు నెలల క్రితమే 'మాతృదేవోభవ' అనాథాశ్రమం నిర్వాహకులు తనను సోషల్ మీడియాలో ట్యాగ్ చేస్తూ వీడియో పెట్టారని అది చూసి చలించిపోయినట్లు చెప్పారు. తాను రిహాబిలిటేషన్

సెంటర్ స్థాపించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.ఇక ఇటీవలే మనోజ్ తన భార్యతో కలిసి ఐక్య సంస్థను ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రజల గొంతుకగా ఉండేందుకు దీన్ని ప్రారంభించినట్లు చెప్పారు. దీని కార్యకలాపాల కోసం సొంత నిధులనే వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ ట్రస్ట్ ద్వారా రక్తదానం, చిన్నారుల దత్తత.. సహా పలు సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు వెల్లడించారు.

రణ్‌వీర్ 'డాన్ 3' వివాదం వేళ.. తెర పైకి దీపిక 'రేస్ 2'

ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది 'డాన్ 3' చిత్రం. దీనిచుట్టూ కొనసాగుతున్న చర్చల మధ్య రణ్‌వీర్ భార్య, నటి దీపికా పదుకొణెకు సంబంధించిన పాత వివాదం మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. 2012లో జరిగిన 'రేస్ 2' ఘటనను నెటిజన్లు గుర్తుచేసుకుంటున్నారు.

'రేస్ 2' షూటింగ్ సమయంలో దీపికా పదుకొణె ప్రవర్తనపై నిర్మాత రమేశ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన విషయం అప్పట్లో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించింది. ఆరు రోజుల షూటింగ్ అనంతరం ఆమె అకస్మాత్తుగా సినిమా నుంచి వైదొలగారని ఆయన ఆరోపించారు. ఆమె డేట్స్‌కు అనుగుణంగా షూటింగ్ షెడ్యూల్స్ మార్చాల్సి వచ్చిందన్నారు. అయినా చివరి నిమిషంలో ప్రాజెక్ట్ నుంచి వైదొలగడం వల్ల యూనిట్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన పేర్కొన్నారు. అలాగే సమావేశాలకు హాజరుకాకపోవడం, ఫోన్ కాల్స్,

మెసేజ్‌లకు స్పందించలేదని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "నా 25 ఏళ్ల సినీ ప్రయాణంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు" అంటూ ఆమె వృవహార శైలిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమెకు వృత్తిపై అంకితభావం లేదన్నారు. ఆ సినిమా నుంచి దీపిక వైదొలగడంతో చిత్రబృందం ఆమెపై సినీ సంఘాలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది. తనకు ఇంతకుమించిన మార్గం లేదని నిర్మాత అప్పట్లో మీడియాతో వెల్లడించారు. దీంతో దీపిక నిర్మాతలతో చర్చలు జరిపి తిరిగి ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. అయితే కొత్త నిబంధనలతో ఆమె 'రేస్ 2' పూర్తి చేశారు. 2013లో విడుదలైన ఈ సినిమా కమర్షియల్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం 'డాన్ 3' చర్చల మధ్య ఈ పాత వివాదం మళ్లీ వెలుగులోకి రావడం బాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది.

రణ్‌వీర్ సింగ్ బ్యాన్‌పై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్' చీఫ్ అడ్వైజర్ తాజాగా స్పష్టతనిచ్చారు. అది అధికారిక బ్యాన్ కాదని స్పష్టంచేశారు. నటులపై నిషేధం విధించే అధికారం తమకు లేదని తెలిపారు. సమస్యకు పరిష్కారం లభించేవరకూ ఆయనతో కలిసి పని చేయొద్దని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ సభ్యులను ఆదేశించామన్నారు. దీంతో రణ్‌వీర్ 'డాన్ 3' బృందంతో చర్చలు జరిపి కొత్త నిబంధనల ప్రకారం ఆ సినిమాలో నటించే అవకాశం ఉన్నట్లు బీటౌన్ మీడియా పేర్కొంది.